క్లుప్తంగా

నిప్పులగుండం తొక్కిన భవానీలు



నిప్పులగుండం తొక్కుతున్న భవానీ మాలధారుడు

బిక్కవోలు: కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద భవాని మాలధారులు సోమవారం నిప్పులగుండం తొక్కారు. గురు భవాని గంగరాజు ఆధ్వర్యంలో సుమారు 300 మంది భవానీ భక్తులు, గ్రామస్తులు ఆలయం ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో నడిచారు. ఆలయ కమిటీ సభ్యులు జామి విశ్వేశ్వరరావు, మల్లిడి పెద్దిరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒకేషనల్ వృత్తి విద్యాశిక్షణ



ఆస్పత్రిలో అందించే వైద్య సేవలను విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: రఘుదేవపురం పీఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో ఒకేషనల్ వృత్తి విద్యపై ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం ఎం.శ్యామలాదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం వారికి హెల్త్ కేర్, ఫస్ట్ ఎయిడ్, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, రోగులకు వైద్య సేవలు అందించే విధానంపై డాక్టర్ సత్యం రమేష్ బాబు వివరించారు. ఒకేషనల్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్స్యూరెన్స్ ట్రైనర్ బి.పరమేష్, ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ ట్రైనర్ బి.సాయి పృథ్వీ తదితరులు.. బ్యాంకులు, డీసీసీబీ బ్రాంచ్‌లలో ఫారాలు నింపే విధానం, నగదు లావాదేవీలు, రుణాల మంజూరును వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ దాకే మంగమ్మ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



పోలీసుల అదుపులో ఉన్న అనుమానితులు

రాజానగరం: తోకాడలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని గ్రామ సచివాలయ సిబ్బంది పట్టుకుని సోమవారం స్థానిక పోలీసులకు అప్పగించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లకు చెందిన దొంగల ముఠా సభ్యులు.. బాబా ఫొటోలతో తోపుడు రిక్షాతో పగలంతా తిరుగుతూ రాత్రి వేళల్లో దోపిడీలకు పాల్పడుతున్న వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని పట్టుకున్నారు. వారి వివరాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తెలపండి

కోరుకొండ: అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరుకొండ సీఐ సత్య కిశోర్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఓ గ్యాంగ్ సంచరిస్తూ దోపిడీలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల నల్లజర్ల, తణుకు తదితర ప్రాంతాల్లో దాడులు, చోరీ సంఘటనలు జరిగినందున ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కోరుకొండ సర్కిల్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

సుధీర్‌బాబుకు పరామర్శ

కోరుకొండ: బీజేపీ కోరుకొండ మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌బాబును సోమవారం ప్రముఖులు పరామర్శించారు. ఆయన తాత సుబ్రహ్మణ్యం ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ వ్యవసాయ సలహా మండలి మాజీ జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, కోరుకొండ మండల ప్రజాపరిషత్ మాజీ అధ్యక్షుడు బదిరెడ్డి రాజా కోటికేశవరంలోని ఆయన స్వగృహానికి వెళ్లారు. ఆయన తండ్రి ఏపీఆర్ చౌదరి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వివిధ సమస్యలపై 9 అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వివిధ సమస్యలపై తొమ్మిది అర్జీలు అందుకున్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ (సీఎం), టైపిస్ట్ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్ ఫామ్

- లాభదాయకంగా ఆయిల్‌పామ్ సాగు
- రైతులకు ఎన్నో ప్రయోజనాలు
- ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం



నర్సరీల్లో పెంచుతున్న పామాయిల్ మొక్కలు

రంగంపేట: ఆయిల్ పామ్ (పామాయిల్) సాగు చేసే రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఆయిల్ పామ్ విస్తరణ పథకంలో భాగంగా శత శాతం రాయితీపై మొక్కలు అందించడంతో పాటు సాగుకు అవసరమైన పెట్టుబడులను కూడా పెడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో నూనె ధరలు పెరగడంతో పామాయిల్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని, రైతులు పామాయిల్ సాగుకు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.

నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకాలు

ఆయిల్ పామ్ విస్తరణ పథకంలో భాగంగా స్వదేశీ రకం విత్తనం అయితే గరిష్ఠంగా హెక్టారుకు రూ.20 వేలు, విదేశీ రకం మొక్కలైతే రూ.29 వేల వరకూ ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. అదే విధంగా మొక్కలకు నీరు పోయడం, ఎరువులు వేయడం, కూలీల ఖర్చు, ఇతర వాటికి హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు పెట్టుబడి సాయాన్ని ఇస్తోంది. అలాగే పామాయిల్ తోటలో అంతర పంటల సాగుకు కూడా ప్రభుత్వం హెక్టారుకు ఏడాదికి మరో రూ.5250 చొప్పున నాలుగేళ్ల పాటు ఇస్తోంది. ఆరేళ్లు దాటిన పామాయిల్ తోటలో అంతర పంటగా కోకో సాగు చేసుకోవచ్చు. దీనికి కూడా హెక్టారుకు ఏడాదికి 5 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తోంది.

అదనపు ఆదాయం

అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. ఇక పంట చేతికి వచ్చిన తర్వాత గెలలను కోసేందుకు అవసరమైన పరికరాల(కత్తులు)పై రూ.2500 వరకు రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర సుమారు రూ.18,755 పలుకుతోంది. పామాయిల్ మొక్కల సాగుకు ఎడారి ఇసుక నేలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలమే. అనపర్తి నియోజకవర్గంలో ప్రస్తుతం 3,809 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగవుతోంది. వాటిలో అనపర్తి మండలంలో 193, బిక్కవోలు మండలంలో 722, రంగంపేట మండలంలో 2894 ఎకరాలలో ఈ తోటలున్నాయి.



రంగంపేట మండలంలో ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటల సాగు

రాయితీ ఇలా...

మిషన్ ఆన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) ద్వారా పండ్ల తోటలైన మామిడి, జీడి మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ, టిష్యూ కల్చర్‌లో అరటి, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరిలో కోకో, ఆయిల్ ఫామ్‌లో కోకో ఒక రైతుకు 5 ఎకరాల వరకూ, అలాగే బంతి, గులాబీ, చామంతి, లిల్లీ, మల్లి తోటలకు ఒక రైతుకు 2.5 ఎకరాల వరకూ రాయితీ పొందవచ్చు.

- కూరగాయలు పండించే రైతులకు హైబ్రీడ్ కూరగాయల విత్తనాలు ఒక ఎకరానికి రూ.1200, హైబ్రీడ్ కూరగాయల తోటల పెంపకానికి ఒక ఎకరానికి రూ.8 వేలను పథకాల ద్వారా రాయితీ పొందవచ్చు.
- తీగజాతి కూరగాయలు పండించే రైతులు శాశ్వత పందిరి వేసుకోవడానికి ఎకరానికి రూ.లక్ష, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ద్వారా డ్రిప్ వేసుకున్న చిన్న, సన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి ఐదు ఎకరాల లోపు నూరు శాతం రాయితీ అందిస్తున్నారు.

వినియోగించుకోవాలి



ఉద్యానవన శాఖ ద్వారా పామాయిల్ సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మొక్కలను సాగు చేసుకోవాలనే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రాయితీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

– అల్లం నాగ దేవిశ్రీ, ఉద్యానవనశాఖ అధికారి, రంగంపేట మండలం

- చిన్న, సన్న కారు రైతులకు ఎస్సీ, ఎస్టీలను మినహాయించి 5 ఎకరాల లోపు 90 శాతం రాయితీ అందిస్తున్నారు. 5 నుంచి 10 ఎకరాలు ఉన్న వారికి 70 శాతం, 12 నుంచి 30 ఎకరాలు అంతకు పైన ఉన్న వారికి 50 శాతం రాయితీ, స్ప్రింక్లర్లకు అన్ని వర్గాల వారికి 50 శాతం రాయితీ ఇస్తున్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి విడుదలపై హర్షం

అనపర్తి: అక్రమ కేసులు బనాయించి ఎల్లకాలం నిర్బంధించలేరని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అక్రమ కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సోమవారం బెయిల్‌పై విడుదల కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి.. ప్రతిపక్ష పార్టీని ఎలా కట్టడి చేయాలన్న ఆలోచనతోనే నిరంతరం పనిచేస్తోందని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన వైఎస్సార్ సీపీ శ్రేణులు వెనక్కితగ్గే పరిస్థితి లేదన్నారు. మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంపై అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ

పెదపూడి: జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వాలు ఎంతో వెసులుబాటును కల్పించాయని, దీనిపై దుకాణదారులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు పెదపూడిలో సోమవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాలపై ర్యాలీ నిర్వహించామన్నారు. ఏ వస్తువులపై జీఎస్టీ ఎంత శాతం తగ్గించారో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శులు జి.ఉషారాణి, వాసంశెట్టి శ్రీనివాస్, సిబ్బంది బేనర్జీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

జీవితంలో విద్యార్థి దశ కీలకం



ఎన్‌సీసీ శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాజానగరం: జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, దానిని సవ్యంగా ఉపయోగించుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి ఎన్‌సీసీ క్యాడెట్లను చైతన్యపరుస్తూ ప్రసంగించారు. క్రమశిక్షణ, దేశభక్తితో పాటు దేశాభివృద్ధికి తోడ్పడేలా యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జాతీయ సమైక్యత, సంస్కృతి, సంప్రదాయాలపై యువతకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్, కాకినాడ కమాండర్ కల్నల్ ఎం. అగర్వాల్, కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ హెచ్.ఎస్. మానిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ఆయుష్మాన్ భారత్



పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం: దేశంలో ప్రజలందరూ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని బీజేపీకి చెందిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో సోమవారం నిర్వహించిన స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన అక్కడికి వచ్చిన రోగులతో ముచ్చటించారు. ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన కల్పించారు. సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కలిగిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైసింగ్ ఫౌండేషన్ ద్వారా గృహిణులకు కూరగాయల విత్తనాలను అందజేశారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో నిర్వహించిన స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. దీనిద్వారా మహిళలు, పిల్లలు, కిశోర బాలికల ప్రత్యేక అవసరాలను గుర్తించి తగిన వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిచంద్రప్రసాద్, డాక్టర్ యు.విజయలక్ష్మి, డాక్టర్ సోమనాథ్, డాక్టర్ గీత, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింది.. వస్తువుల ధరలు తగ్గాయా!

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించింది. ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు కూడా తగ్గాయి, ఆ విషయం మీకు తెలుసా, తగ్గిన ధరలతోనే సరుకులు కొనుగోలు చేస్తున్నారా?.. అంటూ లీగల్ మెట్రాలజీ శాఖ సోమవారం రాజానగరంలో 'ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ శాఖ రాజమహేంద్రవరం విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ బీఎస్‌వీ సాయి ఈశ్వరరామ్ మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్‌లో వచ్చిన మార్పులతో అనేక వస్తువుల ఎంఆర్పీలు తగ్గాయన్నారు. దీంతో ఎంఆర్పీ కంటే తక్కువకే విక్రయాలు చేయాలని, అలా చేయకుంటే వెంటనే ఆయా విక్రయదారుడిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్సై ఎస్. నాగేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డు సభ్యుడు వై. నాగేశ్వర్రావు, వర్తక సంఘం ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్‌లతో కలసి స్థానిక 5వ వార్డులో ఇంటింటికీ వెళ్లి జీఎస్టీటీ 2.0 పై ప్రజలను చైతన్యపరిచారు.

కాటన్ సంచులతో పర్యావరణ పరిరక్షణ



కాకినాడలో కాటన్ సంచులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెదపూడి: పాలిథిన్ కవర్లకు బదులుగా కాటన్ సంచులను వినియోగించడం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. సంపర గ్రామంలోని సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎస్ఈఏ)ఆధ్వర్యంలో పాలిథిన్ వదిలేద్దాం – ప్రకృతిని రక్షిద్దాం అనే నినాదంతో పాలిథిన్ సంచులకు బదులుగా కాటన్ సంచులు తయారు చేయించారు. ఈ కార్యక్రమానికి మేము సైతం అంటూ గ్రామంలోని 16 మంది దర్జీలు ముందుకు వచ్చి శ్రమదానంతో 2 వేల కాటన్ సంచులు తయారు చేశారు. వాటిని ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నారు. ఆ సంచులను సోమవారం కాకినాడలో కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం నింపేలా ముందడుగు వేయడం అభినందనీయమని అసోసియేషన్ ప్రతినిధులు, దర్జీలను అభినందించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ఏడేళ్లుగా తమ అసోసియేషన్ తరఫున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సంచులను అక్టోబర్ 4న పాఠశాల విద్యార్థులతో ఇంటింటికి పంపిణీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మల్లిపూడి శివ ప్రసాద్, వాడపర్తి తాతీలు, సోమేశ్వరరావు, తిబిరిశెట్టి మణికంఠ, ఉపాధ్యాయులు ఫణిబాబు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం తనిఖీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల సహాయక పునరావాస కేంద్రాన్ని రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) అధికారి ఆర్.కృష్ణ నాయక్ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. అక్కడి వైద్య శిబిరం, బాధితులకు ఇస్తున్న భోజనం, ఇతర వసతులను పరిశీలించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో బ్రిడ్జి లంక నుంచి 123 మంది, కేతావారీ లంక నుంచి 75 మంది, వెదురమ్మలంక నుంచి 76 మంది ఉన్నారన్నారు. మొత్తం 98 కుటుంబాలకు చెందిన 274 మంది ఆశ్రయం పొందుతున్నారని ఆర్డీవో తెలిపారు. అక్కడి బాధితులతో ఆయన మాట్లాడి, వారి అవసరాలను తెలుసుకున్నారు.

దసరాకైనా బకాయిలు చెల్లించండి

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం దసరా పండగకైనా ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ సత్యనారాయణ, రెడ్డి అన్ను వెంకట్రావు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. దసరా పండగకు డీఏ ఇవ్వాలని, జెడ్‌పీపీఎఫ్ పార్ట్ ఫైనల్ పేమెంట్ వైద్య, గృహ అవసరాల పేమెంట్‌కు నిధులు విడుదల చేయాలన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు



నాగంపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌క్యూఏఎస్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ సుధ

సీతానగరం: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించారని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎస్.సుధ తెలిపారు. నాగంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణను సోమవారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ వర్చువల్‌గా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పర్యవేక్షణాధికారి డాక్టర్ సుధ మాట్లాడుతూ ఈ ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎన్‌క్యూఏఎస్ నుంచి వారం రోజుల్లో నాగంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ధ్రువీకరణ పత్రం వస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ఎస్ సుందరి, ఏఎన్‌ఎం కె.సత్యవతి పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



సంపరలో సరస్వతీదేవి అలంకరణలో విజయదుర్గమ్మ

- ఘనంగా దసరా ఉత్సవాలు
- చదువులతల్లిగా అమ్మవారు

రాజానగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలానక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతీమాతగా దర్శనమిచ్చారు. చక్రద్వారబంధంలోని దేవీచౌక్, రాజానగరం షిరిడీ సాయిబాబా మందిరంలోని సరస్వతీ మాతకు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి కుంకుమ పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో ఆ విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. స్థానిక అగ్రహారంలోని రామాలయం, రావుల చెరువు గట్టున ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ మూలా నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి.

పెదపూడి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గాదేవి అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంపర, జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, రామేశ్వరం, ఏపీత్రయం, గండ్రేడు, కరకుదురు, తదితర గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారి ఆలయాల్లో సరస్వతీదేవి పూజలు ఘనంగా చేశారు. సంపర గ్రామంలో అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు విద్యార్థులతో సరస్వతీ దేవి పూజలు, భక్తులచే సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణ చేయించారు.

కోరుకొండ: మండలంలోని ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కాపవరం రాజరాజేశ్వరి ఆలయంలో ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ, గాడాలలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పడాల పండు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

సీతానగరం: రాపాకలో పత్తి నాగు, పత్తి అయ్యప్ప భవానీల ఆధ్వర్యంలో 108 కలశాలతో అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని భవానీ మాలధారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మండల గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు.

రంగంపేట: రంగంపేట, చంద్రేడు, దొంతమూరు, ఈలకొలను, వడిశలేరు తదితర గ్రామాల్లో అమ్మవారిని చదువులతల్లిగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో చిన్నారులు హాజరై సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రులు కొనసాగుతున్నాయి. అమ్మవారు ఎనిమిది రోజు సరస్వతిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. తొస్సిపూడిలో కాలువ దగ్గర ఉన్న అమ్మవారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గొలుగూరి భారతి, ఉప సర్పంచ్ దార్వంపూడి వీర వెంకట రామారెడ్డి పర్యవేక్షణలో సరస్వతీ పూజలు జరిపారు.



సంపర గ్రామంలో సరస్వతీ దేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు

బతుకమ్మ పండగ

అనపర్తి: పాలమూరు గ్రామానికి చెందిన మహిళలు బతుకమ్మ పండగ నిర్వహించారు. గ్రామంలోని దేవీ సెంటర్‌లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బతుకమ్మ, అద్భుత జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన 32 మంది చిన్నారులు, మహిళలు రెండు గంటల పాటు ప్రదర్శించిన పలు జానపద కళారూపాలు, నృత్యాలు, మహిషాసుర మర్దని ఘట్టం, బతుకమ్మ కార్యక్రమం ఆకట్టుకుంది. సత్సంగం వ్యవస్థాపకులు గురుమాత గొలుగూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు నెలలుగా మహిళలకు సంప్రదాయ నృత్యాలలో శిక్షణ అందించి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సత్సంగం నిర్వాహకులు మల్లిడి వీర్రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో కళా ప్రదర్శన చేసిన మహిళలకు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ద్వారంపూడి ఈశ్వరరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సత్తి శ్రీనివాసరెడ్డి (మీసాల శ్రీను), నల్లమిల్లి దేవిరెడ్డి, మల్లిడి నాగిరెడ్డి తదితరుల చేతుల మీదుగా జ్ఞాపికలు ప్రదానం చేశారు.



పందలపాకలో వెలమపేట రామాలయం వద్ద సరస్వతి పూజ చేస్తున్న చిన్నారులు



రాజానగరంలోని సాయిబాబా మందిరంలో జరుగుతున్న పూజలు



రాపాకలో 108 కలశాలతో జరిగిన లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



పాలమూరులో బతుకమ్మ ఆడుతున్న ఓం శక్తి సత్సంగం సభ్యులు